# న్యాయవ్యవస్థకు నూతన చేతన ఎప్పుడు?

**BB- 10-April-2006**

జయప్రకాష్ నారాయణ్

ప్రజాస్వామ్య మూలస్తంభాల్లో న్యాయవ్యవస్థ ఒకటి. పౌరులకు సత్వర న్యాయం అందించాల్సిన బాధ్యత దీని పై ఉంది. ఇందులో విఫలమైతే మొత్తం వ్యవస్థపైనే ప్రజలు విశ్వాసం కోల్పోయే ప్రమాదముంది. అలాంటి పరిస్థితి ఉత్పన్నమవడానికి కారణాలేమిటి? పౌరులకున్న ప్రత్యామ్నాయాలేమిటి? ఈ పరిస్థితిని అధిగమించేందుకు న్యాయవ్యవస్థ చేస్తున్న , చేయాల్సిన ప్రయత్నాలేమిటి?

ఇటీవలి కాలంలో అనేక కేసుల్లో ప్రాసిక్యూషన్ విఫలం కావడంతో ప్రజల దృష్టి మరోమారు మన న్యాయవ్యవస్థ వైపు మళ్లింది. పౌర, నేర న్యాయ వ్యవస్థ వైఫల్యం ఫలితంగా న్యాయపాలన పతనం అంచులకు చేరిందంటూ న్యాయకోవిదులతోపాటు రాజకీయ నాయకులు, విశ్లేషకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మన ఆర్థిక వ్యవస్థ చెప్పుకోదగ్గ స్థాయిలో ఏటా ఎనిమిది శాతం వృద్ధి సాధిస్తోంది. తగినన్ని మౌలిక వసతులు లేకపోవడం, శ్రామికుల ఉత్పాదకత తక్కువగా ఉండటం, న్యాయ పాలన వైఫల్యం- ఇవీ ప్రగతి పథంలో ప్రధాన అవరోధాలు. ఈ మూడు పరిపాలనతో ముడివడినవే. దోషుల్ని దండించలేకపోతున్నారు. వివాదాలు పరిష్కరించలేకపోతున్నారు. ప్రభుత్వ చట్టబద్ధతను పెంపొందించలేకపోతున్నారు. పరిపాలన వైఫల్యానికి ఇంతకు మించిన నిదర్శనాలు ఉండవు. సత్వరం, శాంతియుతంగా వివాదాలను పరిష్కరించటంలో, ఒప్పందాలను అమలుపరచడంలో ప్రభుత్వ వైఫల్యం- పెట్టుబడికి అవరోధంగా మారుతోంది. విపత్కర పరిస్థితికీ దారితీస్తోంది. అంతకన్నా ప్రమాదకరమైన పరిణామమేమిటంటే- హింసాత్మక పద్ధతుల ద్వారా మొరటుగా తక్షణ న్యాయం అందజేసే కొత్త వ్యవస్థే పుట్టుకొచ్చింది. దుర్భర దారిద్ర్యం, దురన్యాయం, చాలీచాలని సేవలు- ప్రభుత్వ చట్టబద్ధతనే గండికొడుతున్నాయి. దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో మావోయిస్టుల హింసాత్మక చర్యలకు, అరాచకానికి అదే కారణమవుతోంది. అక్రమ ఆయుధాల దన్నుతో మావోయిస్టులు తిరుగుబాటు కార్యకలాపాలకు తెగబడుతుంటే- అవినీతిపరులు, అసమర్థులైన పాలకులు అదేం పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. దాంతో దేశ సుస్థిరతకు, ఆర్థిక అభివృద్ధికి పెనుసవాలు ఎదురవుతోంది.

మన న్యాయస్థానాల్లో మూడుకోట్ల కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. న్యాయపాలన వైఫల్యానికి ఇది తిరుగులేని తార్కాణం. అనేక నాగరిక దేశాల్లో క్రిమినల్ కేసులకన్నా పరిష్కారం కావలసిన సివిల్ వివాదాలే ఎక్కువగా ఉంటాయి. కానీ, భారతదేశంలో నేరాల రేటు తక్కువే అయినా సివిల్ కేసులకన్నా రెండింతల క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. రెండు ప్రమాదకర ధోరణులకు ఇది సంకేతం. ఒకటి- సివిల్ వివాదాల్లో అనేకం కోర్టులదాకా రావడంలేదు. ప్రజలు కోర్టు బయటే సమస్యలను పరిష్కరించుకొంటున్నారు. లేదా అన్యాయాన్ని సహించి, మౌనంగా ఉండిపోతున్నారు. న్యాయ వ్యవస్థపై ప్రజల విశ్వాసం సన్నగిల్లిందనేందుకు పత్తా లేకుండాపోతున్న ఈ కేసులే సాక్ష్యం. రెండోది- న్యాయపాలన కొరవడింది. కర్ర ఉన్నవాడిదే బర్రె అనే పరిస్థితి వచ్చేసింది. ప్రతి సమస్యకూ హింస, నేరాలే పరిష్కార మార్గాలని ప్రజలు భావిస్తున్నారు. పౌర న్యాయ వ్యవస్థ విఫలమైంది. చట్టాన్ని అమలుపరచే వ్యవస్థ బలహీనతా బయటపడింది. ఫలితంగా మన సమాజం నానాటికీ నేరగ్రస్తమవుతోంది. రాజకీయ పదవిలో ఉంటే నేర విచారణను నీరుగార్చేందుకు బోలెడన్ని అవకా

శాలు ఉంటాయి. అందుకే అనేకమంది నేరగాళ్లు రాజకీయాల గొడుగు నీడలో తలదాచుకొంటున్నారు. దాంతో నేర న్యాయ వ్యవస్థ మరింతగా దెబ్బతింటోంది. ప్రభుత్వ అధికారం బాగా బలహీనపడుతోంది.

న్యాయమైన పోటీకి, శీఘ్ర ఆర్థిక వృద్ధికి అనుకూల వాతావరణాన్ని సృష్టించడంలో న్యాయపాలన సంస్థలే కీలకమైనవని మనం గుర్తించాల్సిన తరుణమిది. న్యాయ వ్యవస్థలో పనిచేస్తున్న వారి వేతనాల సవరింపునకు ఏర్పాటుచేసిన మొదటి జాతీయ సంఘం (జ్యుడీషియల్ పే కమిషన్) తెలియజేసినదాని ప్రకారం- న్యాయ వ్యవస్థపై మనం పెడుతున్న పెట్టుబడి అతి తక్కువ స్థాయిలో ఉంది. స్థూల దేశీయ ఉత్పత్తి (జి.డి.పి.)లో 0.2 శాతం కన్నా అది తక్కువ. ఇందుకు విరుద్ధంగా సింగపూర్‌లో జి.డి.పి.లో 1.2 శాతం, అమెరికాలో 1.4 శాతం, బ్రిటన్‌లో 4.3 శాతం కేటాయిస్తున్నారు. సమర్థమైన న్యాయ వ్యవస్థ ఆర్థిక ప్రాముఖ్యాన్ని ఆ దేశాలు గుర్తించాయి. మనదేశంలో పదిలక్షల మందికి 12 మంది జడ్జీలు ఉండగా, ఆర్థిక సహకార అభివృద్ధి సంస్థ (ఒ.ఇ.సి.డి.) దేశాల్లో అంతకు పదింతలు న్యాయమూర్తులు ఉండటం ఆశ్చర్యం కలిగించదు.

బడ్జెట్ కేటాయింపులు, జడ్జీల సంఖ్య సరే. ఇది అంతకు మించి సంక్లిష్టమైన సమస్య. న్యాయమూర్తుల పని తీరు ఏమంత సంతృప్తికరంగా లేదు. మంచి తెలివైన న్యాయవాదులు సాధారణంగా న్యాయమూర్తి పదవులను నిరాకరిస్తుంటారు. అనేక విశ్వవిద్యాలయాల్లో న్యాయవిద్య ప్రమాణాలు పతనమయ్యాయి. అందుకే దీని ప్రమాణాలు పడిపోతున్నాయి. కాలం చెల్లిన పద్ధతులను పట్టుకొని వేలాడుతున్నారు. తిమ్మిని బమ్మి చేయడానికి, అసాధారణ రీతిలో జాప్యానికి దాంతో అవకాశం కలుగుతోంది. పవిత్రమైన న్యాయవ్యవస్థకూ అవినీతి మకిలి అంటుకొంది. ప్రమాణంచేసి అబద్ధాలు చెప్పడం మన సమాజంలో మామూలైపోయింది. నిజాయతీపరులు, గౌరవ ప్రతిష్ఠలు కలిగినవారు సైతం అలా ప్రమాణం చేసి అబద్ధాలాడటాన్ని నైతికంగా నిందార్హమైనదిగా భావించరు. పోలీసులు తరచు మొరటుగా, వృత్తి ధర్మానికి విరుద్ధంగా వ్యవహరిస్తుంటారు. రాజకీయ ఒత్తిళ్లు, అవినీతి కార్యకలాపాల కారణంగా నేరపరిశోధన నీరుగారుతోంది. ఇదో అంతులేని కథ. పటిష్ఠమైన ఆర్థిక వ్యవస్థను, న్యాయబద్ధమైన సమాజాన్ని నిర్మించాలంటే న్యాయపాలనను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని క్రమేపీ అన్ని వర్గాల వారూ గుర్తిస్తుండటం సంతోషదాయకం. ప్రజల ఒత్తిడి పెరుగుతోంది. ప్రభుత్వ చట్టబద్ధతకు గండి పడుతోంది. రాజకీయ నాయకులను ఇది కలవరపెడుతోంది. తనపట్ల నమ్మకం సడలుతుండటం న్యాయవ్యవస్థకూ ఆందోళన కలిగిస్తోంది. శాంతి, సామరస్యం, ఒప్పందాలను కట్టుదిట్టంగా అమలు చేయడం, సత్వరం సమర్థంగా వివాదాలను పరిష్కరించడం సాధ్యపడకపోతే సంపదను సృష్టించలేమని వ్యాపారవేత్తలూ గ్రహించారు. బలవంతుడిదే రాజ్యం కావడం, వ్యవస్థ చచ్చుబడిపోతుండటం మధ్యతరగతి ప్రజలకు, మీడియాకు ఆగ్రహం తెప్పిస్తోంది. మన ఆవేదన, ఆందోళనలను నిర్మాణాత్మక చర్యలవైపు మళ్లించాలి.

మన న్యాయ వ్యవస్థను మెరుగుపరచడానికి అనేక కమిటీలవారు, నిపుణులు పలు ఆచరణాత్మకమైన, ప్రభావశీలమైన సూచనలు చేశారు. మొదట- చిన్న చిన్న సివిల్, క్రిమినల్ కేసుల విచారణకు తక్కువ ఖర్చుతో కూడిన, పౌరులతో స్నేహభావంతో మెలగగల స్థానిక న్యాయస్థానాలను ఏర్పాటు చేయాలి. బ్రిటన్‌లో మాదిరిగా అవి సరళమైన పద్ధతులను అనుసరించాలి. నిర్ణీత కాలవ్యవధిలో న్యాయం అందజేయాలి. సమాజంలో న్యాయపాలనను పునరుద్ధరించాలి. రెండోది- ఆధునిక పరిస్థితులు, అవసరాలకు అనుగుణంగా విచారణ చట్టాన్ని సవరించాలి. తద్వారా సత్వర విచారణకు వీలు కల్పించాలి. మన పౌర, నేర విచారణ, సాక్ష్య చట్టా

ల్లోని అనేక నిబంధనలు కాలం చెల్లినవని నిపుణులు గుర్తించారు. మూడోది- న్యాయవ్యవస్థలోని కొలువులను ఆకర్షణీయమైనవిగా, మంచి తెలివితేటలుగల న్యాయవాదులను ఆకట్టుకొనేలా తీర్చిదిద్దాలి. ఐ.ఎ.ఎస్., ఐ.పి.ఎస్.ల మాదిరిగానే న్యాయవ్యవస్థ కోసం కూడా అఖిల భారత సర్వీసును ఏర్పాటు చేసేందుకు మన రాజ్యాంగం వీలు కల్పిస్తోంది. అత్యంత ప్రతిభాశాలురను ఆకర్షించి, మంచి హోదాతోను, వృత్తిపరమైన గొప్ప అవకాశాలతోను వారిని ఆకట్టుకునేందుకు ఈ సర్వీసుకు శ్రీకారం చుట్టాలి. నాలుగోది- ఉన్నతస్థాయి న్యాయాధికారుల నియామకం, తొలగింపు వ్యవహారాలను పర్యవేక్షించడానికి జాతీయ న్యాయ సంఘాన్ని (నేషనల్ జుడీషియల్ కమిషన్) ఏర్పాటుచేయాలి. ప్రస్తుత పద్ధతుల ద్వారా ఉన్నతస్థాయి న్యాయ ప్రమాణాలకు హామీ ఇవ్వలేం. న్యాయమూర్తుల జవాబుదారీతనాన్ని పెంపొందించడంలో అభిశంసన ప్రక్రియ ఇప్పటికే విఫలమైంది. అయిదోది- పోలీసు వ్యవస్థను పూర్తిగా ఆధునికీకరించాల్సిన అవసరం ఉంది. ఆరోది- నేరపరిశోధనను పోలీసుల ఇతర విధుల నుంచి వేరుచేయాలి. స్వతంత్రంగా నేర పరిశోధన జరపాలి. జవాబుదారీతనాన్ని పెంపొందించాలి. నేరపరిశోధన - విచారణ వ్యవస్థలు సమన్వయంతో వ్యవహరించాలి. చివరగా- పోలీసు, న్యాయవ్యవస్థల్లో పెరిగిపోతున్న అవినీతికి పగ్గంవేసేందుకు చర్యలు చేపట్టాలి. ఈ విషయంలో మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్, ఉత్తరప్రదేశ్ హైకోర్టులు చూపిన దారి అనుసరణీయం. న్యాయపాలన ప్రాముఖ్యాన్ని పునరుద్ధరించేందుకు ఇంకెంతో కృషి చేయాల్సి ఉంది, చేయాలి కూడా. ప్రజల్లో ప్రబలిన అసంతృప్తిని దృష్టిలో పెట్టుకొని ఈ విషయంలో దృఢంగా వ్యవహరించడానికి తగిన సమయమిదే.

(రచయిత లోక్‌సత్తా,'ఓట్ ఇండియా'ల సమన్వయకర్త)